
ఉపాధి దొంగలు..!

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలి..లక్ష్యాలను అధిగమించాలి..ఇదీ సమీక్షల్లో జిల్లా అధికారులు తరచూ చెప్పే మాట. అయితే వాస్తవ పరిస్థితులు దీనికి భిన్నంగా ఉంటున్నాయి. కూటమి పాలనలో అధికార పార్టీ నేతలు తమ 'ఉపాధి'కి మార్గంగా ఎంచుకున్నారు. గతంలో పనులు చేసిన గుంతల్లోనే మళ్లీ జేసీబీతో తవ్వి, కొత్తగా పనులు చేసినట్లు చూపించడం.. బినామీ కూలీలతో పనులు చేయించి జాబ్ కార్డున్న వారి పేరిట మస్టర్లు సృష్టించడం..ఆపై ఎంచక్కా బిల్లులు చేసుకుని 'ఉపాధి' దొంగలై, అసలైన కూలీల కడుపు కొడుతున్నారు. వీరికి ఉపాధి ఏపీడీ మొదలు ఏపీఓ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తమ వంతు అండదండలు ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.ఫలితంగా పలమనేరు నియోజకవర్గంలో నాయకులు మొదలు ఉపాధి అధికారుల వరకు అందరూ ఇంటి దొంగలే అయ్యారు.!

–పలమనేరు

- కూటమి నేతలకు 'ఉపాధి' పుష్కలం..!
- గతంలో పనులు చేసిన గుంతల్లోనే యథేచ్ఛగా జేసీబీతో పైపై పనులు
- ఫేషియల్ వచ్చినా ఆగని అక్రమాలు
- చెరువుల్లో పాత గుంతలకే మళ్లీ ఈజీఎస్‌లో బిల్లులు!
- అక్రమార్కులకు అధికారుల అండదండలు



పెద్దపంజాణి మండలం బొమ్మరాజుపల్లె వద్ద అడవికొత్త చెరువులో జేసీబీలతో ఉపాధి పనులు చేసినట్లు గుర్తులు



వీకోట మండలం అత్రపల్లె చెరువులో ఉపాధి కూలీలు లేకుండా జేసీబీతో పనులు చేసిన దృశ్యాలు

నిబంధనల మేరకు ఉపాధి పనులిలా...

అయా గ్రామాల్లో ఉపాధి పనులు చేయాలంటే తొలుత గ్రామసభలను నిర్వహించి అవసరమైన పనులను గుర్తించాలి. ఆపై జాబ్ కార్డున్న వారికి ఆ పనులు కల్పించాలి. ఈ తీర్మానాన్ని సంబంధిత పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు ఆమోదించాలి. ఆపై ఉపాధి అధికారులు పనులు పర్యవేక్షిస్తూ, వాటిని మస్టర్‌లో నమోదు చేస్తూ, జీపీఎస్ ఆధారంగా బిల్లులు పెట్టాలి. పనుల ప్రదేశంలో కూలీల ఫొటోలను తీసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలి. కానీ కూటమి నేతలు ఉపాధి అధికారులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారు. దీనికితోడు గతంలో ఉన్న మేట్లను తొలగించి కూటమికి అనుకూలంగా ఉన్నవారిని పెట్టుకోవడంతో 'చేసిందే పని..పెట్టిందే బిల్లు' అనే లెవెల్లో దోచుకుంటున్నారు.

ఉపాధి పనులు కావవి కాంట్రాక్టు పనులు

జాబ్ కార్డున్న కూలీలకు వాస్తవంగా పనులు కల్పించడం లేదు కూటమి నేతలే కాంట్రాక్టర్లుగా మారి జేసీబీలతో పనులు చేసి బినామీ కూలీలతో పైపై మెరుగులు దిద్ది బిల్లులు పెట్టుకుంటున్నారు. ఇక చెరువుల్లో ఇసుకను తోడేందుకు పైనున్న బంకమట్టిని జేసీబీతో తొలగించి ఆ మట్టిని రైతుల పొలాలకు తరలిస్తున్నారు. చెరువుల్లో తవ్విన గుంతలకు ఉపాధిలో బిల్లులు చేసుకుంటూ, మరోవైపు గుంతకిందనున్న ఇసుకను ఎంచాక్కా అమ్ముకుంటున్నారు! ఈ అక్రమాలు అన్ని మండలాల్లోనూ సాగుతూనే ఉన్నాయి. నియోజకవర్గంలో ఈ ఆరునెలల్లో రూ.5కోట్ల వరకూ పనులు చేయగా, వీటిలో రూ.4కోట్ల వరకూ అక్రమాలు సాగినట్లు సమాచారం. వడ్డించేవాడే మనోడైతే ఏ బంతిలో కూర్చొంటే ఏముందిలేననే చందాన నియోజకవర్గంలో ఉపాధి పనులు ఉంటున్నాయి. కనీసం జిల్లా అధికారులు కూడా ఏ రోజూ తనిఖీ చేసిన పాపానపోలేదు.

పలమనేరు నియోజకవర్గ సమాచారం

మొత్తం మండలాలు: 5

మొత్తం పంచాయతీలు 90

మొత్తం గ్రామాలు:520

ఈ పర్యాయం ఈజీఎస్ బడ్జెట్ రూ.5 కోట్ల దాకా

చేస్తున్న పనులు: నీటి కుంటల నిర్మాణం, చెరువుల్లో పూడికతీత, చేలకు బంకమట్టి, క్యాటిల్ షెడ్లు, హార్టికల్చర్ ద్వారా మొక్కల నాటడం మొదలైనవి.

ఇప్పుడు సాగుతున్న అక్రమాలిలా...

ప్రస్తుతం ఈజీఎస్ ద్వారా సప్లయ్ ఛానళ్లు, నీటి కుంటల పనులను జేసీబీలతో చేసి వాటిని కూలీలు చేసినట్టు తప్పుడు రికార్డుల సృష్టించి నిధులు స్వాహా చేస్తున్నారు. గతంలో ఉపాధి కింద చేసిన నీటి కుంటల పనుల ప్రాంతంలోనే మళ్లీ జేసీబీతో రాత్రి పూట పనులు చేసి వీటిని కూలీలతో చేయించినట్లు బిల్లులు పెడుతున్నారు. ఇక వెటర్నరీ శాఖ ద్వారా క్యాటిల్ షెడ్ల నిర్మాణాలను కూటమి అనుచరులకు కేటాయించి వారు నాసిరకంగా పనులు చేసినా అడిగేవారే లేరు. క్యాటిల్ షెడ్ల లబ్ధిదారుల ఎంపిక సైతం ఆయా మండలాల ఈజీఎస్ అధికారుల ప్రమేయమే లేకుండా కూటమి నేతలే ఎంపిక చేసుకుని లబ్ధిదారుల నుంచి కమీషన్లు తీసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

కుప్పం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం కుప్పం ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు ఎర్రబాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, యాజమాన్యం సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆరు నెలలకోసారి మెడికల్ చెకప్ చేయించాలని, భద్రతకు సంబంధించిన సర్క్యులర్‌ను విధిగా అమలు చేయాలని, లాంగ్ డ్యూటీ, రెండు రోజులు కంటిన్యూ డ్యూటీలకు అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రధానమైన డిమాండ్లపై స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు మునెప్ప, కార్యదర్శి జయపాల్, యూనియన్ నాయకులు జయశంకర్, నారాయణ, అరుణ్, ఎల్లుస్వామి, చంద్రా నాయక్, మణ్యం తదితరులు పాల్గొన్నారు.

104 సేవలు సద్వినియోగం చేసుకోవాలి



104 వాహనంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి విజయ్‌చంద్ర

బైరెడ్డిపల్లి: గ్రామాల్లో 104 వాహన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర కోరారు. మండలంలోని ధర్మపురిలో బుధవారం 104 వాహనంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రక్తహీనత సమస్య అధిగమించడానికి మంచి పోషకాలు ఉన్న కూరగాయలు, ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సంచార జాతులకు పదిశాతం రిజర్వేషన్లు ప్లీజ్!



మంత్రి సవితకు వినతి పత్రం ఇస్తున్న బీసీ రాష్ట్ర సంచార జాతుల అసోసియేషన్ నేత రవి

పలమనేరు: బీసీ కులాల్లోని సంచార జాతులకు బీసీ రిజర్వేషన్ల కారణంగా న్యాయం జరగడం లేదని, అందుకే పదిశాతం ఎంబీసీలకే రిజర్వేషన్లు కల్పించాలని మంత్రి సవితకు బుధవారం అమరావతిలో వినతిపత్రం ఇచ్చినట్టు ఏపీ సంచార జాతుల అసోసియేషన్ నాయకుడు రవి తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చర్చించి, అసెంబ్లీలో బిల్లు పెట్టి, పార్లమెంటుకు పంపాలని మంత్రిని కోరామని, ఇప్పటికే బీసీ- ఏలోని 93 కులాల్లో 20 సంచార జాతి కులాలకు రిజర్వేషన్ ఫలాలు ఏమాత్రం అందడం లేదని ఆమె దృష్టికి తీసుకెళ్లినట్టు తెలియజేశారు. ఇకనైనా సంచార జాతులకు న్యాయం చేయాలని కోరామన్నారు.

అదనపు ఆర్థిక సహాయం సద్వినియోగం చేసుకోండి

- హౌసింగ్ డీఈఈ స్వామిదాస్



చౌడేపల్లెలో రికార్డులను పరిశీలించి మాట్లాడుతున్న డీఈఈ స్వామిదాస్

చౌడేపల్లె: గృహ నిర్మాణ శాఖ నుంచి లబ్ధిదారులకు (ఏఎఫ్ఏ) అడిషనల్ ఫైనాన్స్ అసిస్టెన్సీ ద్వారా మంజూరైన అదనపు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ డీఈఈ స్వామిదాస్ కోరారు. బుధవారం హౌసింగ్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. 2019 నుంచి వివిధ దశల్లో గృహ నిర్మాణ పనులు ఆపేసిన లబ్ధిదారులు 3,139 మంది ఉన్నారని, వారందరికీ ఈ ఆర్థిక సహాయం అందుతుందని, ఈ సొమ్ముతో పనులు త్వరగా పూర్తి చేసేందుకు దృష్టి పెట్టాలన్నారు. ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేల చొప్పున అందిస్తారని, దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు పూర్తిచేసేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భూపతి, కంప్యూటర్ ఆపరేటర్ సులేమాంపాల్గొన్నారు.

మహిళపై కుక్కల దాడి



చౌడేపల్లె: కుక్కల దాడిలో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన చిన్నకొండామర్రిలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శాంతమ్మ ఇంటి వద్ద నుంచి వీధిలోకి వస్తుండగా వీధి కుక్కల గుంపు దాడి చేసి గాయపరిచాయి. గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో 8 కుక్క కాటు కేసులు నమోదైనట్లు వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు.

మెరుగైన పాలనతో మన్ననలు

- సదుం ఎంపీపీకి మార్గదర్శనం చేసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి



ఎంపీపీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

సదుం: ఇటీవల నూతన ఎంపీపీగా ఎంపికైన మాధవి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బుధవారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన ఎంపికకు కృషి చేసిన ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి శాలువతో సన్మానించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, మెరుగైన పాలనతో ప్రజల మన్ననలు పొందాలని ఆమె మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయ రెడ్డి, పుత్రాజు, ఎల్లారెడ్డి, రమణారెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

సదుం: మండలంలోని పాపిరెడ్డిగారిపల్లెలో ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం బుధవారం ప్రారంభమైంది. సాయంత్రం గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ, శాంతి హోమాలు, కుంభారాధన నిర్వహించారు. గురువారం గ్రామోత్సవం, అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త దామోదర తెలిపారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలను ప్రజల్లో ఎండగడతాం



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్ రెడ్డి

పలమనేరు: చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీతో తమను బురిడీ కొట్టించి అధికారంలోకి వచ్చారని ప్రజలు గ్రహిస్తున్నారని, హామీలను నెరవేర్చకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారని పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ హేమంత్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ తరుణంలో చంద్రబాబు హామీలను ప్రజల్లో ఎండగట్టి, పార్టీ బలోపేతానికి చేద్దామని పిలుపునిచ్చారు. రెండో పర్యాయం పట్టణ కన్వీనర్‌గా పార్టీ అధిష్టానం నియమించిన నేపథ్యంలో బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాటమే అజెండాగా అందరి సమన్వయంతో ముందుకుపోతామన్నారు. కూటమి పాలనలో ఆ పార్టీ వాళ్ల జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారనే తేటతెల్లమైందని, సంక్షేమాన్ని విస్మరించారని ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. చంద్రబాబు హామీలను ఎందుకు నెరవేర్చలేదో ప్రశ్నించే దిశగా ప్రతి వార్డులో ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తామన్నారు. అనంతరం ఆయన్ను పార్టీ శ్రేణులు సన్మానించాయి. కార్యక్రమంలో నాయకులు రహీంఖాన్, కోదండరామయ్య, మండిసుధా, చెంగారెడ్డి, రవి, శ్యామ్, నరేష్, ముజ్జు, హేమ, వీరభద్ర, యాసీన్ షరీఫ్, అక్బర్, కీలపట్ల సామి, భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి, సోము,బాబు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

● ఏపీఆర్‌జేసీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

పుంగనూరు: ఏపీఆర్‌జేసీ పరీక్షలు రాసేందుకు విద్యార్థులకు నెల రోజులు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బుధవారం లయన్స్‌క్లబ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ విలేకరులకు తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న సాధన సెంటర్‌లో కరస్పాండెంట్ మహిపాల్‌రెడ్డితో కలసి విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల విద్యార్థులు సాధన సెంటర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

● నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన

సదుం: మండలంలోని భట్టువారిపల్లెలో నూతన తిరుపతి గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం యాగపూజ, ప్రాణప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

చెట్టుపై నుంచి పడి తీవ్రగాయాలు

పుంగనూరు: చెట్టుపై నుంచి కింద పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని కంగానెల్లూరులో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామస్తుడు శంకరప్ప (40) గ్రామ సమీపంలోని చింతచెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా అదుపు తప్పి కింద పడ్డాడు గమనించిన స్థానికులు అతడిని 108లో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శభాష్ పలమనేరు విద్యార్థులు

- రాష్ట్ర స్థాయి సైన్సు ప్రయోగాల్లో ప్రతిభ చాటారు



రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

పలమనేరు: పట్టణంలోని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయిలో సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం సుస్థిరత అభివృద్ధి, మూఢనమ్మకాలపై సైన్సు ప్రయోగాల పోటీల్లో పట్టణానికి చెందిన ఓఎల్‌ఎల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని జేవీవీ కార్యదర్శి బాలాదిత్య తెలిపారు. రాష్ట్ర స్థాయిలో బహుమతులను పొందిన చిన్నారులు నందకిశోర్, చరణ్‌సాయి, రీహాన్, భరత్, అఫ్సానా, ఇంద్రప్రసాద్, వరుణ్, హరీష్‌లను బుధవారం ఆ స్కూలులో అభినందించారు. జేవీవీ నిర్వాహకులు గిరిధర్‌మూర్తి, యుగంధర్, సుదర్శనాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ హెచ్‌ఎంకు సన్మానం



గౌరహ్ సుల్తానా దంపతులను సత్కరిస్తున్న విశ్రాంత ఎంఈఓ సాయిలీల



నాగరాజ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లి: స్థానిక బైరెడ్డిపల్లె బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గౌరహ్ సుల్తానా ఉద్యోగ విరమణ పురస్కరించుకుని బుధవారం గౌరహ్ దంపతులను సన్మానించారు. విశ్రాంత ఎంఈఓ సాయిలీల మాట్లాడుతూ, తన సర్వీసులో ఎందరో విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేశారని, సమయపాలన పాటిస్తూ స్కూలు అభివృద్ధికి పాటు పడ్డారని గౌరహ్ సేవలను ప్రస్తుతించారు. శేష జీవితం ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు రామచంద్ర, అంజలి, షాబుద్దీన్, స్వర్ణలత, వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లూరులో ఉపాధ్యాయునికి..

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జెడ్పీ హైస్కూలులో సోషల్ టీచర్ కె.నాగరాజ ఉద్యోగ విరమణ పురస్కరించుకుని బుధవారం సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎంఈఓ సిద్ధరామయ్య మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని, ఎందరో విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దే అవకాశం ఒక టీచరుకే ఉందన్నారు. ఈ దిశగా ఎందరో విద్యార్థులను భావిపౌరులుగా నాగరాజ తీర్చిదిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ తాతయ్య, జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు సోమశేఖరనాయుడు, గౌరవాధ్యక్షుడు రాధాకృష్ణ, కార్యదర్శి ఏకాంబరం, హెచ్‌ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుప్పం రూపురేఖలు మారుస్తాం

కుప్పం: కుప్పం పట్టణాన్ని ప్రగతిపథంలో నడపడానికి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏడాదిన్నర వ్యవధిలో కుప్పం పట్టణ రూపురేఖలు మార్చి తీరుతామన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.4 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. దీపం పథకం కింద 3,482 గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 2026 నాటికి పూర్తిగా కుప్పం నియోజకవర్గంలో సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామన్నారు. విమానాశ్రయం కోసం ఇప్పటికే 1200 ఎకరాల భూసేకరణ పూర్తి చేసి, ప్రభుత్వానికి నివేదికలు పంపామని, దీంతో పాటు పక్కనే ఉన్న మరో 600 ఎకరాలు పరిశ్రమల శాఖకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎస్సీ వసతి గృహాల కోసం రూ.3.7 కోట్లు, ఎస్టీ వసతి గృహాల కోసం రూ.2.6 కోట్లు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతుల కోసం రూ.52 కోట్లు నిధులు మంజూరుకాగా టెండర్లు పిలిచినట్లు తెలిపారు. పలమనేరు – కృష్ణగిరి 4 వే లైన్ కోసం సర్వేలు పూర్తి చేసి, ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

అగ్రహారంలో ఘర్షణ

- దంపతులపై కొడవలితో దాడి



గాయపడిన రమణమ్మ

చౌడేపల్లె: మండలంలోని ఎస్ అగ్రహారం గ్రామంలో భూ తగాదా విషయమై ఘర్షణ పడి, కొడవలితో దాడి చేయడంతో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకొంది. బాధితురాలి కథనం మేరకు.. ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన రమణమ్మ, గణేష్ దంపతులకు అతడి అన్న కృష్ణమూర్తి, సుమిత్ర దంపతుల నడుమ భూ వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో రమణమ్మ, గణేష్ దంపతులు గ్రామానికి సమీపంలోని తమ పొలం వద్ద పనులు చేసుకుంటున్నారు. ఆ సమయంలో కృష్ణమూర్తి అక్కడికి వచ్చి, గణేష్, రమణమ్మతో ఘర్షణ పడి, కొడవలితో వారిపై దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో రమణమ్మ తీవ్రంగా గాయపడింది. గాయపడిన ఆమెను పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'భవిత'లో ఘనంగా ఆటిజం దినోత్సవం



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

రొంపిచెర్ల: దివ్యాంగులకు విద్య, సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని ఎంఈఓ ఇందిర అన్నారు. బుధవారం భవిత పాఠశాలలో ప్రపంచ ఆటిజం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, దివ్యాంగుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దివ్యాంగులు అవకాశాలను అందిపుచ్చుకుని అన్నింటా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడారు. ఉపాధ్యాయులు లోకనాధరెడ్డి, అషారున్నీషా, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ హేమలత, భవిత టీచర్లు అములు, మానస, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

బైరెడ్డిపల్లి: ప్రపంచ ఆటిజమ్ దినోత్సవం సందర్భంగా బుధవారం భవిత కేంద్రం విద్యార్థులతో స్థానిక పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐఈ ఆర్‌పీ నిర్మల కుమారి మాట్లాడుతూ, ఆటిజమ్ సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు భవిత కేంద్రంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, దీనిని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చైతన్యకుమార్, సరిత, చంద్రప్రకాష్, ప్రవీణ, గోవిందుస్వామి, చిట్టెమ్మ పాల్గొన్నారు.

భూ వివాదం.. దాడులు

పుంగనూరు: మండలంలోని లక్కుంట గ్రామంలో భూవివాదం బుధవారం జరిగిన దాడుల్లో ఇద్దరు గాయపడిన సంఘటన బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన చెన్నారెడ్డి, రాజారెడ్డి, వాలెప్ప బంధువులు. వీరికి భూమి విషయమై తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో చెన్నారెడ్డిపై రాజారెడ్డి వర్గం వారు దాడి చేసి గాయపరిచారని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్ఐ లోకేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డంపింగ్ యార్డ్‌లో అగ్నిప్రమాదం

పుంగనూరు: పట్టణ సమీపంలోని మార్లపల్లె వద్ద ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డ్‌లో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగిందని అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు తెలిపారు. మంటలు రావడంతో మున్సిపల్ సిబ్బంది ఫిర్యాదు చేశారని తెలిపారు. వెంటనే మంటలను అదుపు చేశామన్నారు. బీడీలు, సిగరెట్లు ఆర్పకుండా వేయడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వేసవిలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకుని, అగ్నిప్రమాదాలు జరగకుండ చూడాలని, బీడీలు, సిగరెట్లు ఆర్పి పడవేయాలని, నిర్లక్ష్యం చేసి ఆస్తుల నష్టానికి కారకులు కాకూడదని సూచించారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర

నేడు నిమజ్జనం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లెలో బుధవారం నడివీధి గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. విద్యుత్తు దీపాల నడుమ అమ్మవారు వేకువ జాము నుంచి భక్తుల దర్శనార్థం కొలువు దీరారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, కర్ణాటక, తమిళనాడు భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో శిరస్సు మెరవణి

అమ్మవారి శిరస్సు మెరవణి మంగళవారం అర్ధరాత్రి పుంగనూరు రోడ్డులోని గ్రామ సచివాలయం వద్ద ప్రారంభమైంది. మంగళ వాయిద్యాల నడుమ బజారు వీధి మీదుగా సాగి కోట వీధి వద్ద ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని కొలువు దీర్చారు. ఊరేగింపులో ప్రతి ఇంటి వద్ద అమ్మవారి శిరస్సుకు హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. రెండు రోజుల గంగమ్మ జాతర గురువారం ఉదయం నిమజ్జనంతో ముగియనుంది. అమ్మవారి విశ్వరూప దర్శనం అనంతరం మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా వేడుకలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ శివారులో నిమజ్జనం చేస్తారు.

విద్యతోనే వికాసం



ఎంఈఓలను సన్మానిస్తున్న టీచర్లు

పలమనేరు: విద్యతోనే వికాసం సాధ్యమని పలమనేరు ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం పేర్కొన్నారు. పట్టణంలోని నార్త్ ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓలు మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి, తమ తల్లిదండ్రులను కలలను సాకారం చేసి జీవితాలను సార్థకం చేసుకోవాలన్నారు. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవోలను టీచర్ల బృందం సన్మానించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.